సాక్షి
సూర్యాపేట
ఆదివారం ; 29 ; అక్టోబర్ ; 2023



ఓటేద్దాం.. విలువ పెంచుదాం
ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. - 10లో



సీపీఐ నేతపై హత్యాయత్నం
సీపీఐ నల్లగొండ పట్టణ కార్యదర్శి గాదె రమేష్‌పై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. - 10లో



రోడ్లు మారలే..
ఆలేరు నియోజకవర్గంలో సాగునీటి వసతికి చేపట్టిన రిజర్వాయర్లు, కాల్వల పనులు పూర్తి కాలేదు. - 10లో

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు
దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు వారికి కేటాయించిన విధుల్లో నిమగ్నమైనందున సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకట్రావు శనివారం తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన ఉండాలి

ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి

తుంగతుర్తి: ఈవీఎం యంత్రాల పనితీరుపై పీఓలు, ఏపీఓలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాలలో పీఓలు, ఏపీఓలకు ఈవీఎంల పనితీరుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ముందస్తుగా ప్రతి ఇంటికి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని ఆదేశించారు. మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం యంత్రాలు, బ్యాలెట్ కంట్రోల్‌రూం, వీవీప్యాట్ల కనెక్షన్లు మరమ్మతులకు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి యాదగిరిరెడ్డి, డీటీ హరిశ్చంద్రప్రసాద్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ ఎత్తివేత

చెక్‌పోస్ట్ ఎత్తివేయడంతో అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న టెంట్

పాలకవీడు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పాలకవీడు మండలంలోని మహంకాళిగూడెం గ్రామ సమీపంలో కృష్ణానది పుష్కరఘాట్ వద్ద రాష్ట్ర సరిహద్దులో అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రెండు రోజుల క్రితం వరకు చెక్‌పోస్ట్ వద్ద అధికారులు తనిఖీలు కొనసాగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో చెక్‌పోస్ట్‌ను తొలగించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ లింగయ్య శనివారం తెలిపారు. దీంతో మండలంలోని పలువురు రాజకీయ నాయకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాల నుంచి అక్రమంగా నగదు, మద్యం చేరే అవకాశం ఉందని, ఈ సమయంలో చెక్‌పోస్ట్ ఎత్తివేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరిస్తాం
చిలుకూరు: చిలుకూరులోని 10వ వార్డులో మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని గ్రామీణ నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ డీఈలు దేవభిక్షం, అభినయ్ తెలిపారు. శనివారం చిలుకూరులోని మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ ట్యాంక్‌లు, మోటార్లను వారు పరిశీలించారు. తక్షణమే మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూస్తామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కరెంట్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వారి వెంట ఏఈ నాగరాజు, సర్పంచ్ కొడారు బాబు, కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, ఉపేందర్ తదితరులున్నారు.

మట్టపల్లి ఆలయం మూసివేత

శ్రీలక్ష్మీనరసింహస్వామి గర్భాలయానికి ద్వారబంధనం చేస్తున్న అర్చకులు

మఠంపల్లి: చంద్రగ్రహణం ప్రభావంతో శనివారం సాయంత్రం మట్టపల్లి పుణ్యక్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామిదేవాలయం, శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయాలను అర్చకులు మూసివేసి, ద్వారబంధనం చేశారు. అర్ధరాత్రి తరువాత 1.04 గంటల నుంచి 2.23 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుందని, ఆదివారం తెల్లవారుజామున ఆలయాలు తెరిచి సంప్రోక్షణలు పూర్తిగావించి, ఉదయం 10గంటల నుంచి దర్శనాలు అందుబాటులోకి తెస్తామని ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు.

రగిలిన అసంతృప్తి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి


అనుచరుల సమావేశంలో మాట్లాడుతున్న పాల్వాయి స్రవంతి

కాంగ్రెస్‌లో అసమ్మతి గళం
- అనుచరులతో మునుగోడు నేతలు కృష్ణారెడ్డి, స్రవంతి భేటీ
- పోటీలో ఉంటానని స్పష్టం చేసిన చలమల్ల కృష్ణారెడ్డి
- మిర్యాలగూడ సీటు సీపీఎంకు ఇస్తే తాను పోటీలో ఉంటానంటున్న బీఎల్‌ఆర్
- మునుగోడు టికెట్ కేటాయించకపోవడంతో సీపీఐ నారాజ్


సమావేశానికి హాజరైన కృష్ణారెడ్డి అనుచరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో అసంతృప్తి రగులుగుంది. మునుగోడు టికెట్ ఖరారుపై కాంగ్రెస్ ఆశావహులు చలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి వేర్వేరుగా తమ అనుచరులతో సమావేశాలు నిర్వహించారు. సేవ్ మునుగోడు పేరుతో తాను పోటీలో ఉంటానని చలమల్ల స్పష్టం చేయగా, తాను పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్రవంతి తీర్మానం చేశారు. అయితే తమకు న్యాయం చేయడంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలోని పాత నాయకులు, కార్యకర్తలకే పదవులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక మిర్యాలగూడ స్థానాన్ని సీపీఎంకు కేటాయిస్తారన్న సమాచారంతో ఆ పార్టీలో హడావుడి నెలకొంది. అక్కడి నుంచి కాంగ్రెస్ నాయకుడు బత్తుల లక్ష్మారెడ్డి.. పార్టీ టికెట్ ఇవ్వకపోయినా పోటీలో ఉంటారని ఆయన వర్గం చెబుతోంది.

మునుగోడులో ఆగ్రహ జ్వాలలు
బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికే మునుగోడు టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేయడంతో ఆశావహుల్లో అసంతృప్తి భగ్గుమంది. అక్కడ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామ చేసి బీజేపీలో చేరారు. దీంతో మునుగోడులో ఉప ఎన్నిక వచ్చింది. ఈ నేపథ్యంలో అక్కడ కాంగ్రెస్ టికెట్ చలమల్ల కృష్ణారెడ్డికి ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో ఆయన నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ఉప ఎన్నికలో మునుగోడు టికెట్ పాల్వాయి స్రవంతికే ఇవ్వాల్సి వచ్చింది. దీంతో, వచ్చే సాధారణ ఎన్నికల్లో కృష్ణారెడ్డికే టికెట్ ఇస్తామని అధిష్టానం చెప్పడంతో అప్పట్లో కృష్ణారెడ్డి చల్లబడ్డారు. ప్రస్తుతం ఇక టికెట్ తనకే వస్తుందని చలమల్ల ఆశించారు. ఆయనతోపాటు పాల్వాయి స్రవంతి కూడా టికెట్ కోసం ప్రయత్నించారు. కానీ, బీజేపీ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కూడా మునుగోడు టికెట్‌ను రెండో జాబితాలో ఆయన పేరును ఖరారు చేసి ప్రకటించింది. దీంతో మునుగోడులో చలమల్ల కృష్ణారెడ్డితో పాటు పాల్వాయి స్రవంతి ఇద్దరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అనుచరులతో సమావేశాలు
టికెట్ ఆశించి భంగపడిన చలమల్ల కృష్ణారెడ్డి తాను పోటీలో ఉంటానని శనివారం ప్రకటించారు. చౌటుప్పల్ మండలంలోని దామెర గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో తన అనుచరులతో సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఈ ప్రకటన చేశారు. అదేవిధంగా హైదరాబాద్ నగర శివారు తుర్కయాంజల్‌లో సన్నిహితులు, అనుచరులతో సమావేశమైన పాల్వాయి స్రవంతి.. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానంటూనే మెలిక పెట్టారు. కాంగ్రెస్ పార్టీలోని పాత నాయకులు, కార్యకర్తలకే పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్ష పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను ఇవ్వాలనే డిమాండ్‌తో ఆ సమావేశంలో తీర్మానం చేశారు. అంతేకాదు రాజగోపాల్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారం ప్రారంభానికి ముందే బహిరంగ సభ ఏర్పాటు చేసి వాటికి ఒప్పుకుంటున్నట్లు చెప్పాలని మెలిక పెట్టారు. అప్పుడే తాము సహకరిస్తామని సమావేశంలో తీర్మానించడం గమనార్హం.

ఫ్రెండ్లీ కాంటెస్టుకు సిద్ధమవుతున్న సీపీఐ
కాంగ్రెస్ పార్టీతో పొత్తులో భాగంగా మునుగోడు టికెట్‌ను తమకే వస్తుందని సీపీఐ మొదటి నుంచీ భావించింది. అయితే కాంగ్రెస్ పార్టీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మునుగోడు బరిలో ఉంచుతామని ప్రకటించడంతో సీపీఐ కూడా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతోంది. సీపీఐకి బలం కలిగిన మునుగోడు స్థానాన్ని ఇవ్వకపోవడంతో ఆ పార్టీ కేడర్ తీవ్ర నిరాశలో పడింది. అయితే ప్రస్తుతానికి ఒంటరిపోరుకు సిద్ధమవుతోంది. ఈ నెల 31వ తేదీన పార్టీ జాతీయ నాయకుడు డి.రాజాతో.. ఫ్రెండ్లీ కాంటెస్ట్‌పై చర్చించనున్నట్లు సీపీఐ జిల్లా పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మిర్యాలగూడలో సీపీఎంలో హడావుడి, కాంగ్రెస్‌లో ఆందోళన
మిర్యాలగూడ స్థానాన్ని పొత్తులో భాగంగా సీపీఎంకే కేటాయించారన్న ప్రచారంతో సీపీఎంలో హడావుడి నెలకొంది. కానీ, అక్కడ కాంగ్రెస్ పార్టీ నుంచి గత కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, అక్కడినుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్‌ఆర్) ఈ పరిణామాలతో అసంతృప్తిలో పడ్డారు. ప్రస్తుతం మిర్యాలగూడ స్థానాన్ని సీపీఎంకు కేటాయిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఇంకా అధికారికంగా ప్రకటించ లేదు. పార్టీ నుంచి అధికారిక ప్రకటన వెలువడ్డాకే తన తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని బత్తుల లక్ష్మారెడ్డి చెబుతున్నారు. ఒకవేళ తమ పార్టీ టికెట్‌ను సీపీఎంకు ఖరారు చేస్తే లక్ష్మారెడ్డి కచ్చితంగా పోటీలో ఉంటారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

హలో.. 1950

- కలెక్టరేట్‌లో ఓటరు నమోదు సహాయ కేంద్రం
- జాబితాలో పేర్లు లేవంటూ అధికంగా వస్తున్న ఫిర్యాదులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఓటరు నమోదు, ఓటరు జాబితాలో పేరు గల్లంతు, చిరునామా మార్పిడి వంటి సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌లో ఎన్నికల కాల్ సెంటర్ '1950' నంబర్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ హెల్ప్ లైన్ సెంటర్‌లో ఓటర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు సిబ్బంది రాత్రింబవళ్లు అందుబాటులో ఉండనున్నారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, రాత్రి 10 గంటల నుంచి తిరిగి ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అక్టోబరు 10న జిల్లా కలెక్టరేట్‌లో ప్రారంభించిన ఈ కాల్ సెంటర్ సేవలు ఎన్నికలు ముగిసేవరకు అందుబాటులో ఉండనున్నాయి.


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

త్వరితగతిన పరిష్కారం
గత ఎన్నికల్లో ఓటు వేసినప్పటికీ ప్రస్తుతం ఓటరు జాబితాలో గల్లంతైన వారి పేర్లపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఓటరు పేరులో తప్పులు, ఒక పోలింగ్ కేంద్రం బదులు మరో కేంద్రంలో నమోదు, వివరాలు సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నట్లు కాల్‌సెంటర్ ఆపరేటర్లు చెబుతున్నారు. అదేవిధంగా ఒక ఇంట్లో ఉన్న ఐదు ఓట్లలో ఇద్దరి ఓట్లు ఒక పోలింగ్ కేంద్రంలో, మూడు ఓట్లు మరో కేంద్రం పరిధిలోకి మారినట్లు గుర్తిస్తే కుటుంబ సభ్యులందరినీ ఒకే పోలింగ్ కేంద్రంలోకి మార్పించేందుకు కాల్ సెంటర్ ఉపయోగపడుతుంది.

ఫిర్యాదులు ఇలా..
ముందుగా 1950 నంబరుకు కాల్ చేసినప్పుడు సిబ్బంది పేరు, ఫోన్ నంబరు, వ్యక్తిగత వివరాలు అడిగి ఓటీపీ పంపిస్తారు. దానిని వారికి చెబితే ఫిర్యాదును సంబంధిత విభాగానికి చేరవేస్తారు. ఆపై సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేలా జిల్లా ఎన్నికల అధికారులు, సిబ్బంది కృషి చేస్తారు. జిల్లాలో జూన్ నుంచి 1,012 ఫిర్యాదులు రాగా, అక్టోబర్ 10 నుంచి 522 ఫిర్యాదులు అందాయి.

ప్రజా ఆశీర్వాద సభకు ముస్తాబు



తిరుమలగిరిలో ఆదివారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు సిద్ధమైన వేదిక, ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్


కోదాడలో ముస్తాబవుతున్న ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణం

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకట్రావ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పెండింగ్ పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఏపీఓలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలసి మాట్లాడారు. జీపీలో ఉన్న ప్రతి నర్సరీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వారంలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన హరిత హారం నర్సరీలో 74 శాతం బ్యాగులు మట్టితో నింపడం జరిగిందని, మిగిలిన పనులు నవంబర్ 4నాటికి పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామపంచాయతీలో తక్కువలో తక్కువ 25 మందికి పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌ఓ సతీష్ కుమార్, పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు శిక్షణ కార్యక్రమాలు దోహదం
సూర్యాపేటటౌన్ : పోలింగ్ పారదర్శకంగా నిర్వహించేందుకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో పీఓ, ఏపీఓలకు ఎన్నికల రోజున నిర్వహించే విధులు, విధానాలపై రెండో రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణకు 2,769 మంది పీఓలు, ఏపీఓలు హాజరు కాగా 171 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. శిక్షణకు గైర్హాజరైన వారికి ఆర్‌పీ యాక్ట్ 26 ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. సోమవారం ఆయా నియోజకవర్గాల్లో మరోమారు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్‌డీఓలు వీరబ్రహ్మాచారి, సూర్యనారాయణ, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బుల్లెట్‌పై తిరుగుతూ.. రైతులను పలకరిస్తూ


పెన్‌పహాడ్ మండల పరిధిలోని మేఘ్యాతండా నుంచి భక్తాళాపురం వరకు ఎస్సారెస్పీ కాలువపై శనివారం మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి బుల్లెట్ బండిపై తిరుగుతూ రైతులను పలకరించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. – పెన్‌పహాడ్

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు

- ఎస్పీ రాహుల్ హెగ్డే

కోదాడరూరల్: అసెంబ్లీ ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అలసత్వం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే సూచించారు. శనివారం కోదాడలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్‌ఓ కార్యాలయం నుంచి గేట్ వరకు బారికేడ్ల ఏర్పాటు, నామినేషన్ దాఖలు చేసే వారి వెంట ఎంత మందిని అనుమంతించాలనేది నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. వంద మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపివేయాలని, కార్యాలయం గేట్ వద్ద ఉన్న కంపచెట్లను తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, డీఎస్పీ ప్రకాష్, తహసీల్దార్ సాయగౌడ్, సీఐ, సిబ్బంది ఉన్నారు.


ఆర్డీఓ కార్యాలయం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

కేంద్ర బలగాల వసతి పరిశీలన
తిరుమలగిరి (తుంగతుర్తి): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన పారామిలటరీ బలగాల సిబ్బందికి తిరుమలగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వసతి ఏర్పాటు చేశారు. శనివారం ఎస్పీ రాహుల్ హెగ్డే వసతులను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ నాగభూషణం, సీఐ శివశంకర్, ప్రసాద్, సైదులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి
నడిగూడెం: నడిగూడెం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రాహుల్‌హెగ్డే శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేసుల నమోదు రిజిస్టర్లు పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట కోదాడ డీఎస్పీ ప్రకాష్, సీఐ వీరరాఘవులు, ఎస్‌ఐ ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

సూర్యాపేటలో అవినీతిపై చర్చకు సిద్ధం

- ఆరోపణలు నిరూపించలేకపోతే పోటీ నుంచి తప్పుకుంటా
- బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యయాదవ్


మాట్లాడుతున్న వట్టె జానయ్యయాదవ్

భానుపురి (సూర్యాపేట): అభివృద్ధి పేరుతో సూర్యాపేటలో జరిగిన అవినీతిపై చర్చకు సిద్ధమని, ఆరోపణలు నిరూపించలేకపోతే తాను పోటీ నుంచి తప్పుకుని, మంత్రి జగదీష్‌రెడ్డి తరఫున ప్రచారం చేస్తానని సూర్యాపేట నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యయాదవ్ సవాల్ చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాల కోసం అర్హత లేకున్నా తన బంధువు ద్వారా ఏజెన్సీని ప్రారంభించారని, ఒక్కో అభ్యర్థి నుంచి రూ.3లక్షలు వసూలు చేసి ఉద్యోగాలు ఇచ్చిందని ఆరోపించారు. ఇంకా వెయ్యి మంది బాధితులు ఉన్నారని, వారిని బయటకు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణంలోనూ అవినీతి జరిగిందన్నారు. సూర్యాపేట పీఏసీఎస్‌ను రద్దు చేసే అధికారం మంత్రి జగదీష్‌రెడ్డికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రజలంతా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని, బడుగు, బలహీనవర్గాల అభ్యర్థిగా తనకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో లింగానాయక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా, ఆవుల అంజయ్య, భీమపంగు రాజు, మాజీ ఎంపీటీసీ సూర సంధ్యవెంకన్న, దుర్గ దయాకర్, శ్యాం, సైదులుయాదవ్, సతీష్, నాగరాజు, గుండెబోయిన లక్ష్మయ్య, శివరాత్రి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలను పాతిపెట్టిన కేసీఆర్

- తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక కన్వీనర్ ఆకునూరి మురళి

దురాజ్‌పల్లి, కోదాడ, మునగాల, హుజూర్‌నగర్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నిలువునా పాతిపెట్టిందని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆరోపించారు. సూర్యాపేట, కోదాడ, మునగాల, హుజూర్‌నగర్‌లో శనివారం జాగో తెలంగాణ ఆధ్వర్యంలో ఓటు చైతన్య యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో మాట్లాడుతూ కేసీఆర్ అవినీతి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. ప్రాజెక్టుల పేరిట కేసీఆర్ కుటుంబం భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేసీఆర్‌తో రహస్య మైత్రి కొనసాగిస్తోందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం పోటీ పరీక్షలు సక్రమంగా నిర్వహించక, లక్షల మంది నిరుద్యోగులను ఇబ్బందుల పాలు చేసిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో వాటి ఊసే లేకుండా పోయిందన్నారు. నాటి ఉద్యమ ఆకాంక్షలను విద్రోహం చేస్తూ నాలుగున్నర కోట్ల ప్రజల కలలను రూ.వేల కోట్ల కుంభకోణాలతో ఒకే కుటుంబం తన్నుకు పోయిందని, తెలంగాణకు అంతులేని దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. పన్నుల రూపంలో తెలంగాణ ప్రజల నుంచి రూ. లక్షల కోట్లు వసూలు చేసి రూ.వేలల్లో మాత్రమే తెలంగాణకు కేంద్రం ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అవినీతి, దోపిడీ పాలనను ఓడించాలని, మద్యానికి, నోటుకు లోబడకుండా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు కనికట్టు మాటలకు మోసపోవద్దని, రాష్ట్రాన్ని మళ్లీ దోపిడీ వర్గాలకు అప్పజెప్పొద్దని, నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి కల్పించే వారికే ఓటు వేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీఎస్‌డీఎఫ్ సమన్వయకర్త నైనల గోవర్ధన్, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చలపతిరావు, జాగో తెలంగాణ, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక కమిటీ సభ్యులు వినాయక్‌రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, నైనాల గోవర్ధన్, కృష్ణప్రసాద్, జానయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, ప్రజాపంథా నాయకులు హన్మేష్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి ప్రదీప్, పోలేబోయిన కిరణ్, వక్కంతుల కోటేశ్వరరావు, రవి, రాయపూడి చిన్ని, రాఘవరెడ్డి, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేటలో నిర్వహించిన ఓటు చైతన్య యాత్రలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి



సూర్యాపేట కలెక్టరేట్‌లో మోడల్ పోలింగ్ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి

ఓటేద్దాం.. విలువ పెంచుదాం

• ఓటు అవశ్యకతపై 'ఐ విల్ ఓట్' పేరుతో ప్రత్యేక కార్యక్రమం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : నా ఒక్క ఓటుతో ఫలితం తారుమారవుతుందా.? నేను ఓటేయకపోతే వచ్చే నష్టమేముంది..? అంటూ చాలా మంది ఓటును నిర్లక్ష్యం చేస్తుంటారు. ముఖ్యంగా యువతలో కొందరు ఓటేసేందుకు ఆసక్తి చూపడం లేదని ఎన్నికల చరిత్ర స్పష్టం చేస్తోంది. మహిళల ఓటింగ్ శాతం కూడా ఆశించిన స్థాయిలో ఉండటంలేదు. అందరూ ఓటేసినప్పుడే స్పష్టమైన తీర్పు వచ్చినట్లు లెక్క. ఈ నేపథ్యంలో ఓటు వేసేందుకు ఆసక్తి చూపని వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఎన్నికల సంఘం ఆయా జిల్లాల పరిధిలో 'స్వీప్' (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో మోడల్ పోలింగ్ పరికరాలను అందుబాటులో ఉంచి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సూర్యాపేట యంత్రాంగం వినూత్న కార్యక్రమం..

సూర్యాపేట జిల్లా యంత్రాంగం ఓటు ఆవశ్యకతపై వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. దీనిలో భాగంగా నియోజకవర్గ కేంద్రాల్లో సెల్ఫీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల వద్ద ఓటు ఎలా వేయాలి.. ఎవరికి వేయాలో గుర్తులతో వివరాలు నమూన పోలింగ్ పరికరాలను అందుబాటులో ఉంచారు. ఈ కేంద్రం వద్ద 'ఐ విల్ ఓట్... బికాజ్ ఐ లవ్' (నియోజకవర్గం పేరు)తో ఉన్న గుర్తులను ఏర్పాటు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 12 చొప్పున సెల్ఫీ పాయింట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పాయింట్ల వద్ద పోలింగ్ యంత్రాల గురించి వివరించేందుకు సిబ్బందిని నియమించారు. వీరు పోలింగ్ యంత్రాల పని తీరును ఓటర్లకు వివరిస్తారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రవికుమార్, అధికారులు

చౌటుప్పల్ : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని అడిషనల్ డీసీపీ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలో సివిల్, కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రధాన రహదారులతో పాటు జాతీయ రహదారి మీదుగా మార్చ్ నిర్వహించిన పోలీసులు ప్రజలతో మాట్లాడి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు స్వేచ్ఛాయిత వాతావరణలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అందరం కలిసి ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ వై.మొగిలయ్య, సీఐ ఎస్.దేవేందర్, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో మద్యం పట్టివేత

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు అక్రమంగా తరలిస్తున్న 32 మద్యం సీసాలు, 16 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐలు జీపీకే రెడ్డి, సాలకమ్మ తెలిపారు. పట్టుబడిన మద్యంను ఎక్సైజ్ ఎస్ఐ రామకృష్ణకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో రైల్వే పోలీసులు పి. వెంకన్న, మౌలాలి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలువలు కదల్లే రోడ్లు మారలే..!

జంగ్ తెలంగాణ



రాజాపేట శివారు ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డు



గుండాల మండలంలో అసంపూర్తిగా ఉన్న గోదావరి కాలువ

- అసంపూర్తిగా సాగునీటి కాల్వలు.. ప్రారంభంకాని గంధమల్ల
- అక్కడే ఆగిపోయిన 'వాసాలమర్రి'
- అర్థాంతరంగా నిలిచిన ఆలేరు ఆర్‌యూబీ పనులు
- అమలుకాని రెవెన్యూ డివిజన్ హామీ
- అధ్వాన్నంగా రోడ్లు, లోలెవల్ బ్రిడ్జిలు



బొమ్మలరామారం మండలం హాజీపూర్-మాచిన్‌పల్లి మధ్య శామీర్‌పేట వాగుపై బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతం

సెగ్మెంట్ స్కాన్ ఆలేరు

ఆలేరు నియోజకవర్గం పూర్తిగా గ్రామీణ వాతావరణంతో నిండిన ప్రాంతం. హైదరాబాద్‌కు కూతవేటు దూరం. యాదాద్రి పుణ్యక్షేత్రం ఇక్కడ ప్రాధానాకర్షణ. రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఈ ప్రాంతమంతా విస్తరించింది. కానీ.. ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. సాగునీటి వసతి కల్పించేందుకు చేపట్టిన రిజర్వాయర్లు, కాల్వల నిర్మాణ పనులు పూర్తికాలేదు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన 'బంగారు వాసాలమర్రి' అటకెక్కింది. గ్రామీణ ప్రాంత రోడ్లు, బ్రిడ్జిలు అధ్వానంగా తయారయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆలేరు నియోజకవర్గ సమస్యలపై 'సాక్షి' ఫోకస్.

– సాక్షి, యాదాద్రి

ఆలేరు నియోజకవర్గంలో ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీలు, మోటకొండూరు, ఆత్మకూర్(ఎం), గుండాల, రాజాపేట, ఆలేరు, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలు ఉన్నాయి. ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీలు సెమీ అర్బన్ ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. నియోజకవర్గం మొత్తం వ్యవసాయాధారిత ప్రాంతం, సాగునీటి వసతి నామామాత్రంగా ఉన్నా ఇక్కడి రైతులు భూగర్భ జలాలతో రెండు పంటలు పండిస్తారు. కొందరు చేనేత, పవర్ లూం, బీడీ పరిశ్రమ ద్వారా, మరికొందరు ఇతర పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఉపాధి కోసం నిత్యం వేలాది మంది హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నారు.

❖ తుర్కపల్లి మండలం వాసాలమర్రిని సీఎం కేసీఆర్ 2020లో దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. 2021లో గ్రామసభ నిర్వహించి ఏడాదిలోగా గ్రామంలో మొత్తం కొత్తగా ఇళ్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇళ్ల నిర్మాణం దేవుడెరుగు.. గ్రామంలో కనీసం మౌలిక వసతులు పట్టించుకున్న పాపానపోలేదు. కొత్తగా ఇల్లు నిర్మించుకుందామన్న అనుమతులు లభించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన సమస్యలు ఇలా..

❖ నియోజకవర్గంలో ప్రధానమైన సాగునీటి సమస్య ఇప్పటి వరకు తీరలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గంధమల్ల రిజర్వాయర్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. బస్వాపూర్ రిజర్వాయర్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. దేవాదుల నుంచి గుండాల మండలానికి వచ్చే కాల్వల నిర్మాణం పూర్తి కాలేదు.

❖ ఆలేరు నియోజకవర్గం కేంద్రంలో రైల్వే గేటును మూసి వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేటుకు ప్రత్యామ్నాయంగా ఆర్‌యూబీ నిర్మాణ పనులను 2019 అక్టోబర్ 19న ప్రారంభించారు. ప్రస్తుతం ఆ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి.

❖ రాజాపేట మండలంలోని సింగారం నుంచి రాజాపేట మీదుగా యాదగిరిగుట్ట వరకు 20 కిలోమీటర్ల బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. నాలుగేళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం కాలేదు. ఈ రోడ్డు బాగు కోసం రూ.8.50 కోట్లు మంజూరు కాగా పనులు మాత్రం జరగడం లేదు.

❖ బొమ్మలరామారం మండలంలో హాజీపూర్, మునిరాబాద్‌లో శామీర్‌పేట వాగుపై బ్రిడ్జిల నిర్మాణం సమస్యగా ఉంది. హాజీపూర్‌లో సైకో మర్రి శ్రీనివాసరెడ్డి చేతిలో ముగ్గురు బాలికల హత్యల నేపథ్యంలో ఈ బ్రిడ్జి నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది.

❖ ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయాలని ఇక్కడి ప్రజలు పదేళ్లుగా కోరుతున్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీత 2021 అక్టోబర్ 4న ప్రెస్‌మీట్ పెట్టి చెప్పారు. కానీ ఇంత వరకు ఆ హామీ నెరవేరలేదు.

ఇళ్లు కట్టిస్తడని ఎదురుచూస్తున్నాం



కొండాపూర్ నుంచి యాదాద్రి రోడ్డు విస్తరణలో భాగంగా నా ఇల్లు సగానికిపైగా కూలిపోయింది. కొత్త ఇల్లు కట్టుకోలేక సగం కూలిన ఇంట్లోనే ఉంటున్నాం. సీఎం కేసీఆర్ మా గ్రామాన్ని దత్తత తీసుకొని ఇళ్లు కట్టిస్తానని హామీ ఇవ్వడంతో చాలా మంది ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు సర్వేలు చేశారు కానీ.. ఇళ్ల పని మాత్రం మొదలు పెట్టలేదు. ఇళ్లు ఎప్పుడు కట్టిస్తరోనని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నాం.

– నాగపురి సత్తయ్య, వాసాలమర్రి

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదు



బస్వాపూర్ రిజర్వాయిర్‌లో ముంపునకు గురవుతున్న 20 గుంటలకు భూమికి పరిహారం వచ్చింది. కానీ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మాత్రం రాలేదు. గ్రామంలో దాదాపుగా అందరికీ వచ్చాయి. ప్యాకేజీ రాలేదని అధికారులకు తెలియజేశాం. వస్తుంది అంటున్నారు కానీ, ఎప్పుడు వస్తుందో చెప్పడం లేదు. ప్రభుత్వం మాకు ప్యాకేజీ అందజేసి ఆదుకోవాలి.

– దీరావత్ రావిజ్యా, లప్పానాయక్ తండా

అడ్డదిడ్డంగా కాల్వలతో నీరు రాలేదు



గుండాల మండలంలో 2018లో గోదావరి జలాల కోసం సాగునీటి కాల్వలు తవ్వారు కానీ నీరు అందించిన పాపాన పోలేదు. నీటిని విడుదల చేయకపోవడంతో కాల్వలు కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ప్రభుత్వానికి ప్రచారాల మీద ఉన్న ఆర్భాటం రైతుల మీద లేకుండా పోయింది. కొన్ని చోట్ల కాల్వ పనులు పూర్తికాలేదు. కొంతమంది రైతులకు పరిహారం కూడా అందలేదు.

– అత్తి సత్తయ్య, పాచిల్ల, గుండాల మండలం



ఆలేరు పట్టణంలో అసంపూర్తిగా రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి



రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ఆగిపోవడంతో రైల్వే ట్రాక్ పైనుంచి ప్రమాదకరంగా వెళ్తున్న స్థానికులు

చాలా ఇబ్బందులు పడుతున్నాం



ఆలేరు గేటు మూసివేయడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రైలు పట్టాలు దాటుతున్నాం. లేదంటే రెండు, మూడు కిలోమీటర్లు తిరిగి రావాలి. దవాఖానాకు వెళ్లాలన్నా, కూరగాయలు తీసుకోవాలన్నా ప్రతి అవసరానికి గేటు దాటాల్సి వస్తోంది. ఎక్కడి నుంచి ఏ ట్రైన్ వస్తుందోనని నిత్యం భయపడాల్సి వస్తోంది.

– ఎగ్గిడి ఉప్పలయ్య, ఆలేరు మున్సిపాలిటీ 9వ వార్డు

ప్రయాణించాలంటే భయమేస్తోంది



సింగారం నుంచి రాజాపేట మీదుగా యాదగిరిగుట్ట వరకు రోడ్డు మొత్తం దెబ్బతిని కంకర తేలి గుంతలమంగా మారింది. రోడ్డుపై ప్రయాణించాలంటే భయమేస్తోంది. అరగంట పట్టాల్సిన ప్రయాణం గంటకుపైగా పడుతోంది. కంకర్‌పై బండి స్లిప్ అవుతూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– అత్తెల్లి శ్రీకాంత్, సింగారం గ్రామస్తుడు

డివిజన్ చేస్తేనే అభివృద్ధి



ఆలేరును రెవెన్యూ డివిజన్ చేస్తేనే అభివృద్ధి జరుగుతుంది. తరలిపోయిన కార్యాలయాలు తిరిగి వస్తాయి. డివిజన్ కార్యాలయం ఏర్పాటవుతుంది. ఎవరు గెలిచినా ఇక్కడ ప్రజలు మనోభావాలను గౌరవించి డివిజన్ ఏర్పాటు చేయాలి. రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.

– పసుపునూరి వీరేశం, డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్

పురుగుల మందు తాగి ఆత్మహత్య



వెంకటేశ్వర్లు మృతదేహం

హుజూర్‌నగర్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ జహంగీర్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని గాంధీ పార్కు కాలనీకి చెందిన కలకుంట్ల వెంకటేశ్వర్లు (35) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తాగిన మైకంలో తన భార్య భాగ్యలక్ష్మి, కుమార్తె భావన ఇంట్లో లేని సమయంలో పురుగులమందు తాగాడు. శనివారం ఉదయం అతడి తల్లి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సూర్యాపేట క్రైం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శనివారం సూర్యాపేట పట్టణంలోని హైటెక్ కాలనీలో జరిగింది. వివరాలు.. హైటెక్ కాలనీలో నివాసముంటున్న ప్రభుత్వ ఉద్యోగి గుర్రపు వెంకటనర్సింహ ఇంటికి తాళం వేసి తన సొంతూరుకు వెళ్లాడు. శనివారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.83వేల నగదు కనిపించలేదు. దీంతో సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య

భువనగిరి క్రైం : రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భువనగిరి మండలం నందనం గ్రామశివారులో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నామత్‌పల్లి గ్రామానికి చెందిన నాగు హరికుమార్ (33) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం మండల పరిధిలోని నందనం, నాగిరెడ్డిపల్లి 15వ నంబరు గల మైలురాయి వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని భువనగిరి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

భువనగిరి క్రైం: భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రూరల్ ఎస్ఐ వి. సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. భువనగిరి పట్టణానికి చెందిన గొర్ల నవీన్‌యాదవ్, చాట్ల శివ కలిసి గంజాయి అమ్మేందుకు హోండా యాక్టీవాపై వడపర్తికి వెళ్తున్నారు. అదే సమయంలో వడపర్తి ఎక్స్ రోడ్ వద్ద భువనగిరి రూరల్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, వారిని చూసి తప్పించుకునేందుకు వెంబడించి పట్టుకున్నారు. యాక్టీవా సీటు డిక్కీలోని ప్లాస్టిక్ కవర్‌లో గంజాయి లభ్యమైంది. వారి నుంచి ఒక కిలో 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల సెల్‌ఫోన్లు, యాక్టీవా సీజ్ చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నేడు బుద్ధధాతువుల ప్రతిష్ఠాపనోత్సవం

నాగార్జునసాగర్: సాగర్‌లోని బుద్ధవనంలో ఆదివారం బుద్ధధాతువుల ప్రతిష్ఠాపనోత్సవం జరుగనుందని బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. బుద్ధుడు, అతని ఎనిమిది మంది శిష్యుల పవిత్రమైన ధాతువులకు 2009లో ఇండోనేషియాలో బుద్ధపూజ మహోత్సవం నిర్వహించారని పేర్కొన్నారు. భారత్‌లో ఇండోనేషియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాగపూర్‌కు చెందిన గగన్‌మాలిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గగన్‌మాలిక్ స్వీకరించిన ఈ ధాతువులను బుద్ధవనంలోని మహాస్తూపంలో 25 మంది బౌద్ధుల ఆధ్వర్యంలో శాశ్వతంగా నిక్షిప్తం చేయనున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో జాస్మిన్‌రెడ్ బ్లడ్, సీసా, గోల్డెన్‌ప్లష్ బుద్ధ అవశేషాలు ఉంటాయని, ఈ కార్యక్రమానికి బౌద్ధులు, పర్యాటకశాఖ అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

సీపీఐ నేతపై హత్యాయత్నం

- కర్రలు, రాళ్లతో దాడి
- మృతిచెందినట్లు భావించి వెళ్లిపోయిన దుండగులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాదె రమేష్

నల్లగొండ క్రైం: సీపీఐ నల్లగొండ పట్టణ కార్యదర్శి గాదె రమేష్‌పై గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడినట్లు అతడి కుటుంబ సభ్యులు వన్ టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. బాధితుడు, అతడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గాదె రమేష్ గురువారం రాత్రి 8.30గంట సమయంలో నల్లగొండ కలెక్టరెట్ వెనుక కేశవరావునగర్ కాలనీలోని తన నివాసానికి బైక్‌పై వెళ్తుండగా.. ఓ వ్యక్తి అతడిని బైక్‌పై వెంబడించి కాలనీ మూలమలుపు వద్ద అప్పటికే కాపు కాచి ఉన్న వారికి ఫోన్‌లో రమేష్ కదలికల గురించి సమాచారం చేరవేశాడు. అక్కడే కాపు కాచి ఉన్నవారు రమేష్‌ను పిలవడంతో అతడు బైక్ ఆపాడు. వెంటనే కర్రలు, రాళ్లతో రమేష్ తల, కాళ్లు, చేతులపై విక్షణారహితంగా దాడి చేశారు. రమేష్ సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేశారు. రమేష్ స్పృహతప్పి పడిపోవడంతో అతడు మృతిచెందినట్లు భావించిన దుండగలు అక్కడ నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత స్థానికులు గుర్తించి రమేష్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

కారణాలు ఇవేనా..?

రమేష్ నివాసం ఉండే కేశవరావునగర్ కాలనీలో గతంలో స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కొందరు అక్రమంగా విక్రయిస్తుండడంతో దాని గురించి ప్రశ్నించినందుకే రమేష్‌పై దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్న వారికి రమేష్ ఆశ్రయం కల్పించగా.. అది మనసులో పెట్టుకొని ప్లాన్ ప్రకారం హత్యకు కుట్ర చేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు రమేష్ కాల్ డేటాను, ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి కీలక ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

గొర్రెల మంద పైకి దూసుకెళ్లిన టిప్పర్

• 60కి పైగా గొర్రెలు మృతి

నాగార్జునసాగర్: రోడ్డు వెంట వెళ్తున్న గొర్రెల మంద పైకి టిప్పర్ దూసుకెళ్లింది. దీంతో 60కి పైగా గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన నాగార్జునసాగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో దయ్యాలగండి మలుపు వద్ద శనివారం జరిగింది. విజయపురిటౌన్ ఎస్ఐ సురభి సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ముగ్గురు గొర్రెల కాపరులు 500 పైచిలుకు గొర్రెలను తోలుకొని సాగర్ పరిసర ప్రాంతాలకు మేత కోసం వచ్చారు. వర్షాలు లేక భూమి పూర్తిగా ఎండిపోవడంతో మేత దొరక్క శనివారం ఉదయం గొర్రెలను మిర్యాలగూడ, నల్లగొండల వైపు తోలుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో నెల్లికల్లు గ్రామ స్టేజీ దాటిన తర్వాత అటవీ ప్రాంతంలో దయ్యాలగండి మలుపు వద్ద నాగార్జునసాగర్ నుంచి వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి అంబులెన్స్, కారును ఢీకొట్టి గొర్రెల మంద పైకి దూసుకెళ్లింది. దీంతో సుమారుగా 60 పైగా గొర్రెలు మృతిచెందాయి. ఘటనా స్థలం గొర్రెల కళేబరాలతో ఛిద్రం కావడంతో వాహనాలు రోడ్డుపై నిలిచి ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని గొర్రెల కళేబరాలను రోడ్డు పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



రోడ్డుపై నిలిచిన వాహనాలు

స్ట్రాంగ్‌రూంలో మోగిన ఫైర్ అలారం

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఎన్నికల సామగ్రి, ఈవీఎం మిషన్లు భద్రపరిచారు. అయితే శనివారం ఉదయం స్ట్రాంగ్ రూం నుంచి ఫైర్ అలారం మోగడంతో భద్రతా సిబ్బంది వెంటనే ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ చెన్నయ్యకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని ఆర్డీఓ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి, జిల్లా ఎన్నికల అధికారి అయిన నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎస్పీ అపూర్వరావుకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న కలెక్టర్, ఎస్పీ పట్టణంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంను తెరిచి పరిశీలించారు. స్ట్రాంగ్‌రూంలో ఎలాంటి పొగ లేదని, ఎన్నికల సామగ్రి అంతా భద్రంగా ఉన్నాయని, ఫైర్ అలారం సాంకేతిక లోపం వల్ల మోగినట్లు గుర్తించి సరిచేసినట్లు కలెక్టర్ కర్ణన్ తెలిపారు. తిరిగి ఆయా రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో అధికారులు తిరిగి స్ట్రాంగ్‌రూంకు సీల్ చేశారు. వారి వెంట తహసీల్దార్ హరిబాబు తదితరులు ఉన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న నల్లగొండ కలెక్టర్ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు

ఆదాయ పన్ను వివరాలు సమీక్షించుకోవాలి

• నల్లగొండ కలెక్టరేట్‌లో అవగాహన కల్పించిన ఐఆర్‌ఎస్ అధికారులు

నల్లగొండ: ఆదాయ పన్ను వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐటీ) అధికారులు కె.మేఘనాథ్ చౌహాన్, అరవిందక్షన్, అథితి గోయల్, డాక్టర్ పి.సుధాకర్ నాయక్ వివిధ శాఖల డీడీఓలు, ట్రెజరీ అధికారులకు సూచించారు. టీడీఎస్(టాక్స్ డిటెక్ట్ సోర్స్), టీసీఎస్(టాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్)పై శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉద్యోగులు టీడీఎస్, టీసీఎస్ రిటర్న్ దాఖలు చేసేటప్పుడు అన్ని వివరాలను విధిగా చెక్ చేసుకోవాలన్నారు. 24జి స్టేట్‌మెంట్, టీడీఎస్, టీసీఎస్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెల్లింపుల విషయంలో జీఎస్టీ, టాన్, బిన్, పాన్ మొదలగు నంబర్లను సరిచూసుకొని చెల్లింపులు చేయాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఐఆర్‌ఎస్ అధికారులు, నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్